క్లుప్తంగా

పేదలకు ఉచిత నేత్ర పరీక్షలు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏలూరులో పేద ప్రజలకు నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 171 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 22 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. 36 మందికి సబ్సిడీపై కళ్ల జోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో పిల్లి పండరరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకట్రామయ్య, పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



వంతెనపై నుంచి గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: వరదనీరు పారేందుకు ఆదివారం అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇందు కోసం ప్రొక్లెయిన్ ఉపయోగించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు ఏలూరు తూర్పు, పడమట లాకుల మీదుగా కొల్లేరులోకి ప్రవహిస్తోంది. ఇదే సమయంలో వరదనీరు, గుర్రపు డెక్క ఏలూరులో పలు వంతెనల వద్ద పిల్లర్లకు అడ్డుపడి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీన్ని గుర్తించిన అధికారులు ఏలూరులో పడమట, తూర్పు లాకుల వద్ద వంతెనపై నుంచి ప్రొక్లెయిన్‌తో గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ఫలితంగా వరద ప్రవాహం వేగం పుంజుకుంటోంది.

యాదవ సంఘ భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): జిల్లా యాదవ సంఘ భవన నిర్మాణానికి పెదపాడు మండలం కలపర్రుకు చెందిన కన్నెపోటి నాగేశ్వరరావు రూ.5 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, గొర్ల రామారావు, ఆకుల గంగాధర్, తొండూరి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారీ వర్షాల కారణంగా ఈ నెల 22న ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవును కాంపెన్సేటరీ (పరిహారపు) సెలవుగా పరిగణిస్తామని తెలిపారు. ఈ సెలవు దినాన్ని రాబోయే సెలవు రోజుల్లో ఏదైనా ఒక రోజున పని చేయాల్సి ఉంటుందని, దానిపై తదుపరి ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

వైద్య విద్యార్థుల రక్తదానం

దెందులూరు: రక్తదాతలు ప్రాణదాతలని వారి త్యాగం, సేవాభావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని సెయింట్ జోసెఫ్ డెంటల్ వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. ఆదివారం దంత వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మంది దంత వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. వారిని కృష్ణారెడ్డి అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సీల్వరాజు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తమార్పిడి చికిత్స పొందుతున్న తలసేమియా చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్.ఫిలిక్స్, ప్రిన్సిపల్ డాక్టర్ సీల్వరాజ్, డాక్టర్ భావన సంధ్య, డాక్టర్ స్పందన, పీఆర్‌ఓ పీవీ రమణ ఉన్నారు.

రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి

దెందులూరు: దెందులూరు– అప్పారావుపాలెం మధ్య ఉన్న రైల్వేగేటు వద్ద వేలాది మంది భక్తులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్వారకాతిరుమలకు ఏలూరు నుంచి దెందులూరు, అప్పారావుపాలెం తదితర ప్రాంతాల్లోని భక్తులు రావడానికి దెందులూరు మీదుగా ప్రయాణిస్తే దూరం తక్కువ కావడంతో సమయం కలిసి వస్తుంది. భీమడోలు మీదుగా ద్వారకాతిరుమల వెళ్లాలంటే సమయం, దూరం రెండూ ఎక్కువ. దెందులూరు రైల్వేగేటు 15 నిమిషాలకు ఒకసారి వేయడంతో ఈ గేటు మీదుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న బద్దా వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్

ఏలూరు (టూటౌన్): పోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు అన్నారు. ఇఫ్టూ అనుబంధ ఏలూరు చుట్టల కార్మిక సంఘం సమావేశం స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఏలూరు చుట్టల కార్మిక సంఘం అధ్యక్షుడు వి.చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను తిప్పికొట్టే విధంగా ఉద్యమాలలో కార్మిక వర్గం పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. దేశంలో మోడీ, షా సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని కార్మికులకు నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 15న జరిగిన వేతన ఒప్పంద చర్చల విషయాలను కార్మిక వర్గానికి వివరించారు. చుట్టల కార్మికులకు వేయి చుట్టలకు గతంలో రూ.485 ఉండగా రూ.65 పెంచుతూ వెయ్యి చుట్టలకు రూ.550 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ వేతన ఒప్పంద కాల పరిమితి 2024 జూలై 12 నుంచి 2026 జూలై 12 వరకు అమలులో ఉంటుందని చెప్పారు. అదే విధంగా బహుమతులుగా ఇస్తున్నటువంటి బోనస్ మనిషికి రూ.200 పెంపుదల చేస్తూ వేతన ఒప్పంద అగ్రిమెంట్ చేసుకున్నామన్నారు. వేతన ఒప్పందానికి సహకరించిన సిగర్ మ్యానుఫ్యాకర్స్ అసోసియేషన్‌కు ఇఫ్టూ నగర కమిటీ వారికి సిగర్స్ యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఘడసాల రాంబాబు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు క్రాంతి, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు కె.శ్రీను, పల్లి గంగరాజు, సందకం అప్పారావు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాయొద్దు

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అమలు చేయుటకు ప్రయత్నిస్తుందని ఏఐటియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ విమర్శించారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేష్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి, కార్మికులకు నష్టం వాటిల్లే విధానాలకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాల పరిరక్షణకు ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఏఐటీయూసీ, అనుబంధ కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలపై రానున్న రోజులలో పోరాటాలను విస్తృతం చేసేందుకు సెప్టెంబర్ 1 నుంచి మూడు రోజులు విశాఖ నగరంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిందని ఈ ప్రభుత్వం గతంలో ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారంలో ఎటువంటి కృషి చేయలేదన్నారు. ఏఐటియూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు కార్యకలాపాల నివేదికను సమర్పించారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో 100 పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని అలాగే మినిమం వేజ్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ సమావేశం తీర్మానం చేసింది.

24న ఆటోనగర్ అసోసియేషన్ సమావేశం

ఏలూరు రూరల్: ఈ నెల 24 న ఏలూరు ఆటోనగర్ అసోసియేషన్ సభ్యుల అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నామని ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణతార నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గన్‌బజార్ క్రిస్టల్ కల్యాణ మండపంలో నిర్వహించబోయే ఈ సమావేశంలో సభ్యులు పాల్గొనాలని సూచించారు. కొత్త పాలకవర్గం ఏర్పడిన 9 నెలల కాలంలో చేపట్టిన పనులు, మాజీ అధ్యక్షుడు హయాంలో జరిగిన అక్రమాలు, రికార్డుల అప్పగింతపై కొత్త పాలకవర్గం చేపట్టిన చర్యల గురించి వివరించనున్నామని తెలిపారు.

టార్పాలిన్ల పంపిణీ



టార్పాలిన్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్లు

ఏలూరు టౌన్: ఏలూరు జంగారెడ్డిగూడెం రోడ్డులోని సోమవరప్పాడులో రోడ్డు పక్కన గుడారాల్లో జీవనం సాగిస్తోన్న కుటుంబాలకు రెడ్‌క్రాస్ అండగా నిలిచిందని ఏలూరు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవరప్పాడులో 10 కుటుంబాలు రోడ్డు పక్కన గుడారాలు వేసుకొని జీవిస్తున్నాయనీ, వారికి రెడ్‌క్రాస్ వలంటీర్లు టార్పాలిన్లు పంపిణీ చేశారని తెలిపారు. సంచార జాతులకు చెందిన పది కుటుంబాల వారు తమ పిల్లలతో వర్షంలో ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించి టార్పాలిన్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, అరేపల్లి వెంకట శ్రీనివాస్, సాయి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీ టీచర్లను పర్మినెంట్ చేయండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 1998 డీఎస్సీలో ఎంపికై ప్రస్తుతం గత ప్రభుత్వంలో మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లుగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రం సమర్పించినట్టు ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన విషయాలను అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ ఆదివారం ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. 1998 డీఎస్సీలో ఎంపికైన 25 సంవత్సరాలు ఉద్యోగం రాక అంతులేని కష్టాలు అనుభవిస్తూ దుర్భర జీవితం గడిపామని తెలిపారు. వయస్సు మీరి ఏ పనులూ చేయలేని పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో తల్లడిల్లుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల జీతాలు చెల్లించాలని కోరామన్నారు. 25 సంవత్సరాల సర్వీసు నష్టపోయిన తమను రెగ్యులర్ చేసి, పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో రామారావు, వెంకట్రావు, రాజేంద్రప్రసాద్, భానుమూర్తి పాల్గొన్నారు.

సద్గురువుల మార్గాల్లో భారత మూలాలు



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఆపస్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతదేశ మూలాలన్నీ సద్గురువులు బోధించే మార్గాలలోనే పయనిస్తున్నాయని ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రొవ్విడి రాజకుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దొండపాడులో గురు పౌర్ణిమ, వ్యాస జయంతి సందర్భంగా గురు వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ భారతీయుల గురు పరంపర చేసిన మహత్కార్యాల ద్వారానే ప్రపంచం నిలబడి ఉందని, వాటి గురించి తెలుసుకోవడం నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రపాక శ్యాంసుందర్ మాట్లాడుతూ గురువులు అయిన వారు లౌకిక జ్ఞానం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి బీఎస్ఎన్ కె.కల్యాణి మాట్లాడుతూ జీవితంలో ఎంతో మందిని గురువులు సన్మార్గంలో నడిపిస్తారన్నారు. యూపీ స్కూల్ రిటైర్డ్ హెచ్ఎం కె.నాగలక్ష్మి, గణిత ఉపాధ్యాయిని శ్రీదేవి, తెలుగు ఉపాధ్యాయిని పద్మావతిలను ఘనంగా సత్కరించారు.

వాడవాడలా గురు పౌర్ణమి వేడుకలు



పూజలు చేస్తున్న మేయర్ నూర్జహాన్ దంపతులు



కలశాలతో ఊరేగుతున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాడవాడలా గురు పౌర్ణమి పర్వదినాన్ని నగర ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదివారపు పేటలో..

ఆదివారపుపేట శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిర్‌లో నిర్వహించిన గురు పౌర్ణమి పూజల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొని బాబాకు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి విపత్తుల నుంచి ఏలూరు నగరాన్ని కాపాడి ప్రజలందరూ సుభిక్షంగా ఉండే విధంగా బాబా ఆశీస్సులు అందించాలని కోరుకున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని మేయర్ దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని బాబా ప్రసాదం స్వీకరించారు. అనంతరం వట్లూరులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాన్ని దర్శించి శ్రీ దత్తాత్రేయ స్వామి అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) బాబా మందిరం సందర్శించి విశేష పూజలు నిర్వహించి, బాబా రథోత్సవం ప్రారంభించారు.

తంగెళ్లమూడిలో..

స్థానిక తంగెళ్లమూడి 49వ డివిజన్ బూడిద అప్పన్న వారి వీధిలో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయి మందిరంలో గురువులు వాసా ప్రసాద్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అందెల శోభన్ బాబు విశేష పూజలు చేశారు.

కొత్తపేటలో..

స్థానిక కొత్తపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సహకారంతో వెన్నెలకోట లతా శ్రీనివాస్, మహిళ భక్త బృందం ఆధ్వర్యంలో ఉప ఆలయం షిరిడి సాయిబాబా మందిరంలో 108 కలశాలతో నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 108 లీటర్ల గోవు పాలతో బాబాకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం అర్చకులు ప్రకాశాచార్యులు విశేష పూజలు నిర్వహించి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

సబ్బవరపు వీధిలో..

ఏలూరు స్థానిక 43వ డివిజన్‌లో కాయల శేఖర్, శ్రీదేవి ఆధ్వర్యంలో సాయిబాబా గురు పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు పంచ హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా 1500 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

పాండురంగ స్వామి ఆలయంలో..

స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం బాబాకు కాకడ హారతి, విశేష అర్చన చేశారు. ఆలయంలో జ్యోతిర్లింగార్చన చేసి, బాబాకు చావడి ఉత్సవం, దర్బారు సేవ అత్యంత వైభవంగా చేశారు. ఆలయ అర్చకులు దండిబొట్ల కనక సుందర శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్య నిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

కొల్లేరు ప్రాంతాల పరిశీలన



కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

ఏలూరు(మెట్రో): భారీ వర్షాలు, వరదల వలన కైకలూరు నియోజకవర్గంలో కొల్లేరు సరస్సులో వరద నీరు కలవడంతో కొల్లేరు లంక, పెంచికల మర్రి, కొల్లేటికోట, వడ్లకిట్టితిప్ప, ఆలపాడు గ్రామాల్లోని వరద నీరు ప్రవహించే కాలువలను ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి ఆదివారం పరిశీలించారు. ఈ సందగా ఆర్డీవో క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ తమ్మిలేరు వరదనీరు విడుదల కావడంవల్ల ఆ కాల్వగుండా వెళ్లే గ్రామాలను క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వరదనీరుకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, త్రాగునీరు, విద్యుత్ వంటి అతిముఖ్యమైన అంశాలపై సిబ్బంది దృష్టిసారించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ వెంట స్థానిక తహశీల్దారు, రెవిన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గం



వినికిడి యంత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాదరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించారు. మానవత జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి మానవత 2024–25 సంవత్సర నూతన అధ్యక్షుడిగా దేవినేని భాస్కరరావు, కార్యదర్శిగా పోలవరపు దేవరత్నాకరరావు, కోశాధికారిగా పసుపులేటి సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా బుద్ధరాజు వెంకటపతిరాజు, సంయుక్త కార్యదర్శిగా పుల్లూరి సోమశేఖరాచార్యులు, కార్య నిర్వాహక సభ్యులుగా సాయన సుబ్బారావు, కర్రి నరేందర్‌రెడ్డి, నౌడు వెంకట అచ్యుత రామారావులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ మానవత సంస్థ సమాజానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి ఉపనిషత్తుల ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా మానవత ఏలూరు యూనిట్ గౌరవ డైరెక్టర్, నెక్స్‌జన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం మానవత విద్యా నిధికి రూ.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణ, జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు, జిల్లా ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకి రామరాజు, శాంతి రథాల కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

లయన్స్ క్లబ్ నూతన జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాదరావు 316 జిల్లా నూతన గవర్నర్‌గా కాకరాల వేణుబాబుచే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే జిల్లా మొదటి వైస్ గవర్నర్లుగా ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, డాక్టర్ డి.సుబ్బారావులచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మానేపల్లి రామారావు సహకారంతో ఇరువురికి వినికిడి యంత్రాలను అందజేశారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

ఏలూరు రూరల్: అంతర్జాతీయ చెస్ దినోత్సవ సందర్భంగా ఏలూరులో నిర్వహించిన చెస్ పోటీల్లో బాలబాలికలు సత్తా చాటారని చెస్ అకాడమీ డైరక్టర్ జి.యోహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సిద్దార్థ విద్యాలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారని వివరించారు. విద్యార్థుల్లో చెస్ పట్ల ఆసక్తి పెంచి వారిలో నైపుణ్యం వృద్ధి చేసేందుకు పోటీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అండర్–7, 9, 11, 13 వయస్సు విభాగాలకు పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించామన్నారు. జి.అభిషేక్ అవ్రహమ్ ప్రథమ స్థానం, జి.అనురూప్ మోషే ద్వితీయ స్థానం, పి.ఉదయ్‌కుమార్ తృతీయ స్థానం సాధించారని వెల్లడించారు. బాలుర అండర్–7 విభాగంలో ఎస్.స్టీఫెన్, అండర్–9లో బెన్ని, అండర్ 11, 13 అశిష్, ఎస్.శ్రేయస్ విజయం సాధించారన్నారు. బాలికల విభాగంలో టి.మీనాక్షి, ఎస్.నిత్యశ్రీ, ఎస్.హాసిని పలు విభాగాల్లో విజయం సాధించారని తెలిపారు. విజేతలకు న్యాయవాది ఎస్.కాత్యాయిని చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసామని పేర్కొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



నీట మునిగిన నారును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు రూరల్: భారీ వర్షాలకు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తంగెళ్లమూడి, కొమడవోలు ఆయకట్టు కింద నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. మురుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల పంట నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేసి రైతులు నాట్లు వేశారని వివరించారు. దీనిపై సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వివరిస్తామన్నారు. రైతులు గొర్రెల సాంబశివరావు, లావేటి శ్రీనివాసరావు, మొగలి భాస్కరరావు, వినుకొండ నాగేశ్వరరావు, గేదెల రాఘవరాజు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ

ఏలూరు టౌన్: ప్రజల స్వేచ్ఛా జీవనానికి అవాంతరాలు సృష్టిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్లలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ నగరంలోని టూటౌన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలన్నారు. మీ కుటుంబాలు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నేరాలకు పాల్పడకుండా ఉపాధి పొందే మార్గాలను చూసుకోవాలని హితవు పలికారు. భవిష్యత్తులోనూ గొడవలు, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాల్లో జోక్యం చేసుకోమని రౌడీషీటర్లతో చెప్పించారు. మంచి ప్రవర్తనతో మీ కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు. ఏలూరు త్రీటౌన్ ఇన్‌ఛార్జ్ సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్ రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేపట్టారు. త్రీ టౌన్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి వారితో మాట్లాడారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
79955 66352
Office mail : tpgadvt@gmail.com